క్లుప్తంగా

జీఎంకు సన్మానం



జీఎం రమేష్‌ను సన్మానిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ కార్పొరేట్ సీపీపీ జీఎంగా బదిలీపై వెళ్తున్న జక్కం రమేష్‌ను శనివారం సన్మానించారు. ఏరియాలోని పీవీకే-5షాఫ్ట్ కార్మికులు, ఏరియా బీసీ ఉద్యోగులు, ఏరియా ఎంవీటీసీ మేనేజర్ శర్మ ఆధ్వర్యాన సన్మానించగా పలువురు మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి, రవాణాలో రమేష్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు కోటిరెడ్డి, సామ్యూల్ సుధాకర్, బి.రవీందర్, పాలడుగు శ్రీనివాస్‌తో పాటు ఎం.డీ.రజాక్, కలవల చంద్రశేఖర్‌రావు, కూసన వీరభద్రం, చిలక రాజయ్య, కనకరావు, సకినాల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కమాండెంట్ శివప్రసాద్

కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలో షీ టీం ఆధ్వర్యంలో పని స్థలాల వద్ద మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపు సమస్యలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 6వ బెటాలియన్ చాతకొండ కమాండెంట్ శివప్రసాద్, షీ టీం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ పి.రమాదేవి హాజరై మాట్లాడారు. మహిళలకు మహిళా చట్టాల పట్ల అవగాహన ఉండాలని, పనిస్థలాల వద్ద ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే తక్షణమే షీ టీంకు ఫిర్యాదు చేయాలని చెప్పారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

జూలూరుపాడు: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో శనివారం పాపకొల్లు హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హరితోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 19న హరితోత్సవ కార్యక్రమంలో 24 గ్రామ పంచాయతీల్లో అటవీ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీల సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాబూలాల్, ఎఫ్‌ఎస్‌ఓ మల్లయ్య, బీట్ ఆఫీసర్లు బి.నరసింహారావు, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: హరితోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కిన్నెరసాని, ఉల్వనూరు గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల్లో శనివారం వైల్డ్‌లైఫ్ ఆధ్వర్యంలో మొక్కలు, జంతువులు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 25మంది విద్యార్థులు పాల్గొన్నట్లు యానంబైల్ రేంజర్ శ్రీనివాసరావు తెలిపారు. విజేతలకు బహుమతులను హరితోత్సవం నాడు అందజేయడం జరుగుతుందన్నారు.

చెరువుకట్టకు కొత్త శోభ

- రంగురంగుల విద్యుద్దీపాలతో కళకళ
- రూ. 3.37 కోట్లతో ఇల్లెందు మంచినీటి చెరువు సుందరీకరణ
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు



చెరువు కట్టపై సేద తీరుతున్న స్థానికులు

ఇల్లెందు: ఇల్లెందు మంచినీటి చెరువు (జలాశయం) మినీ ట్యాంక్‌బండ్ కొత్త కళను సంతరించుకుంది. అటు చెరువు ఇటు పార్క్ మధ్యలో కట్ట ఆహ్లాదం పంచుతోంది. రంగురంగు విద్యుద్దీపాల కాంతులు, వాకింగ్ ట్రాక్, అలుగు నీరు మిరుమిట్లు గొలిపేలా లైటింగ్, మహిళలు తెలంగాణలో ఘనంగా నిర్వహించే అతిపెద్ద పూల పండుగ బతుకమ్మను సాగనంపేందుకు ఘాట్, చెరువు కట్ట వెంట పచ్చదనం ఉట్టిపడేలా పార్కింగ్, దాని కోసం స్ప్రింక్లర్.. ఇలా ఎన్నో అందాలతో కనువిందు చేస్తోంది. దీని నిర్మాణానికి 2018 సెప్టెంబర్‌లో శంకుస్థాపన జరిగింది. మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణకు రూ.1.62 కోట్లు, లేక్ వ్యూ పార్క్‌కు రూ.1.75 కోట్లతో అభివృద్ధి చేశారు. మూడేళ్లలో పూర్తి చేశారు. గత బుధవారం చెరువు మీద సాగు సంబురాలు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే హరిప్రియ కట్టమీద ఏర్పాటు చేసిన లైటింగ్ పనులను ప్రారంభించారు. కట్ట పొడుగూతా మిరిమిట్లు గొలిపే కాంతులతో కట్ట కొత్తశోభను సంతరించుకుంది. బ్రిటీష్ వారు ఇల్లెందులో బొగ్గు నిక్షేపాలు కనుగొన్న కాలంలో సుమా రు 120 ఏళ్ల క్రితం ఇల్లెందు పట్టణ ప్రజల దాహా ర్తిని తీర్చేందుకు ఇల్లెందులపాడులో జలాశయం ఏర్పాటు చేశారు. ఒక్కసారి నిండితే ఏడాది పొడవునా పట్టణ ప్రజలకు నీటిని అందిస్తుంది. 35 వేల పట్టణ జనాభాకు నీటిని అందించే ఈ చెరువులో 15 అడుగుల నీటిమట్టం నిల్వ ఉంటుంది. చెరువులో రెండు గుమ్మసాలు, వీటి ద్వారా ఫిల్టర్‌బెడ్‌కు నీటి సరఫరా, అక్కడి నుంచి ఫిల్టర్ అయిన నీటిని పట్టణంలోని వాటర్ ట్యాంకులకు ఎక్కిస్తారు. మిషన్ భగీరథ వల్ల కేవలం ఎండాకాలంలో కొన్ని నెలలు చెరువు నీటిని వాడుతున్నారు.



చెరువు కట్టపై విద్యుత్ కాంతులు



అలుగు వద్ద పర్యాటకులు (ఫైల్)

సండే స్పెషల్

మినీ ట్యాంక్ బండ్ ఇలా ...

రూ. 1.62 కోట్లతో ప్రతిపాదించిన మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంతో చెరువు నీటి మట్టం పెరుగనుంది. అలుగు మరమ్మతులు, చుట్టూ కంచె ఏర్పాటు, కట్ట ఎత్తు పెంచి, వెడల్పు చేపట్టారు. బతుకమ్మ ఘాట్ పనులు పూర్తి చేశారు. ఇదిలా ఉండగా కట్ట కింది భాగంలో పార్క్ అభివృద్ధి చేశారు. కట్ట మీద లైటింగ్, రోడ్డు, అలుగుకు మరమ్మతులు, అలుగులోనూ లైటింగ్ ఏర్పాటు, పర్యాటకులు కూర్చునేందుకు బల్లల ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ఇల్లెందులపాడు చెరువులో సర్వే నంబర్ 182/1లో 145 ఎకరాలు, సర్వే నంబర్ 182/2లో 45 ఎకరాల లోతట్టు శిఖం భూమి ఉంది.

ఏళ్లుగా ఎదురు చూశాం..



పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు ప్రత్యేకంగా పట్టణంలో ఎలాంటి ఏర్పాట్లు లేవు. ప్రస్తుతం చెరువు మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చటం వల్ల లైటింగ్, బల్లలు, వాకింగ్ ట్రాక్, విద్యుత్‌కాంతుల్లో చెరువు అందాలను ఆస్వాదించే అవకాశం కలిగింది. పక్కనే లేక్ వ్యూ పార్క్ కూడా ఉండటం వల్ల అలసట, విశ్రాంతి పొందే మార్గం లభించింది. రానున్న కాలంలో చెరువు అలుగు పడితే అలుగు అందాలు మరింత ఆకర్షణీయంగా ఉంటాయి.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, ఇల్లెందు

విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ



మాట్లాడుతున్న నాగరాజు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమను కనబరుస్తూ, కార్పొరేట్ విద్యకు పెద్దపీట వేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని మంచికంటి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో రాష్ట్రం ఏర్పడిన నాటికి హేతుబద్ధీకరణ పేరుతో 12వేల పాఠశాలలు మూసివేసినట్లు చెప్పారు. ఆయా పాఠశాలల్లో సుమారు 25 వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉపాధ్యాయుల కొరతతో ప్రభుత్వ విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందన్నారు. విద్యారంగానికి నిధులు లేక ప్రభుత్వ విద్యాసంస్థలు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆరోపించారు. ఎక్కువ పాఠశాలల్లో మంచినీరు, టాయిలెట్స్ సమస్య అలాగే ఉందన్నారు. సుమారు రూ.4,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో పవన్, బుర్ర వీరభద్రం, భూపేందర్, అభిమన్యు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎన్నికల ప్రచారంలా దశాబ్ది వేడుకలు’

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 2న నుంచి ప్రారంభమైన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఎన్నికల ప్రచార వేదికలా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి డైరెక్టర్లు, అధికారులను బీఆర్‌ఎస్ కార్యకర్తల్లా వాడుకుంటోందని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. శనివారం కొత్తగూడెంలోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో యూనియన్ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించకుండానే కార్మికుల కష్టార్జితం రూ.కోట్లను మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి కార్మికులకు ఛీప్ క్వాలిటీ స్వీట్ బాక్స్‌లు మొహాన కొట్టి, రూ.కోట్లను టెంట్లు, విద్యుత్ దీపాలకు ఖర్చు చేస్తోందని ఆరోపించారు. నిధులు, నియామకాలే ప్రధాన ఎజెండా అన్న నాయకులు... నియామకాలు లేవని, నిధులు ఎమ్మెల్యేల ఇళ్లకు మళ్లాయన్నారు.

వేడుకలకు కార్మిక సంఘాల నాయకులను పిలిచి అవమానించారని, కార్మికులతో, సంస్థతో సంబంధం లేని వారికి పెద్దపీట వేశారని విమర్శించారు. తెలంగాణ వచ్చి తొమ్మిదేళ్లయితే దశాబ్ది వేడుకలు ఎలా చేస్తున్నారని దీనిపై ఏ ఒక్క కార్మిక సంఘం నోరు విప్పడం లేదన్నారు.

వేతనాలివ్వాలని స్వచ్ఛ కార్మికుల సమ్మె



సంఘీభావం తెలుపుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: పాల్వంచ మున్సిపాలిటీలో స్వచ్ఛ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని సమ్మెకు దిగారు. దీంతో శనివారం పట్టణంలో చెత్త సేకరించే వాహనాలు నిలిచిపోయాయి. మున్సిపాలిటీలో 29 చెత్త సేకరణ వాహనాలు ఉన్నాయి. వాటి డ్రైవర్లు, వర్కర్లు చెత్త సేకరించే ఇళ్ల నుంచి నెలకు రూ.50 చొప్పున వసూలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతకాలంగా డబ్బులు సక్రమంగా వసూలు కావడం లేదని దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం సమీపంలో నిరసన దీక్షలు చేపట్టారు. మున్సిపల్ స్వచ్ఛ కార్మికుల సమ్మె శిబిరాన్ని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు విశ్వనాథం సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దీక్షలో కోళ్ల ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్, ఎండీ పాషా, రామకృష్ణ, నాగమణి, నాగేంద్ర, రమణ, శ్రీలత, బర్ల నాగమణి పాల్గొన్నారు.

భోజన వర్కర్ల పెండింగ్ బిల్లులు ఇవ్వండి



ఎంఈఓ జుంకీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: పెండింగ్ బిల్లులు ఇచ్చే వరకు, వేతనాల పెంపు హామీ ఇచ్చే వరకు పాఠశాలల్లో భోజనం వండేది లేదని తెలియజేస్తూ మిడ్ డే మీల్స్ వర్కర్స్ శనివారం జిల్లా వ్యాప్తంగా ఎంఈఓలకు వినతిపత్రాలు అందజేశారు. కొత్తగూడెంలో ఎంఈఓ జుంకీలాల్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి మాట్లాడుతూ.. వర్కర్లకు రోజుకు రూ.33 వేతనం మాత్రమే ఇస్తున్నారని, కూలి పనులకు వెళ్లే రూ.400 వస్తున్నాయని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, వేతనం రూ.16 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని సీట్లలో పోటీ చేస్తాం..



మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఉద్యమకారులు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తారని తొలిమలి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర గౌరవ చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య అన్నారు. శనివారం కొత్తగూడెంలోని ఉద్యమకారుల ఫోరం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 1969 నుంచి 2014 తెలంగాణ సాధన వరకు ఉద్యమకారులది కీలకపాత్ర అన్నారు. సీఎం కేసీఆర్ రైతుబంధును చిన్నరైతులకు పరిమితం చేయాల్సి ఉండగా వందల ఎకరాలు ఉన్నవారికి ఇవ్వడం ఎంటని ప్రశ్నించారు. ప్రజలకు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను పట్టించుకోని ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని పేర్కొన్నారు. ప్రజలు ఉద్యమకారులకు అండగా ఉండాలని కోరారు. ఎం.వలీబాబా, కూచన కృష్ణారావు, అల్లి భాస్కరరావు, ఎడ్ల ఏలియా, కాకెల్లి సైమన్, తమ్మిశెట్టి వెంకటరామారావు, దేవులపల్లి రామ్మూర్తి, శ్రీపాద సత్యనారాయణ, సప్తార్‌బేగ్, అలీముద్దీన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న ఇఫ్టూ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు, బోనస్, వైద్యం, పెనాల్టీ రద్దు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్‌కు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.విశ్వనాథ్, కార్యదర్శి ఎండీ రాసుద్దీన్ వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాల్సి ఉండగా సింగరేణిలో చెల్లించడం లేదన్నారు. అదేవిధంగా గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డైరెక్టర్ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధి కూలీలకు అక్షరాస్యతపై అవగాహన

సుజాతనగర్: ప్రతి వ్యక్తికి అక్షరాస్యత అవసరమని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ పవన్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఉపాధి కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుకన్య యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర బ్యాంకింగ్ పథకాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట గ్రామపంచాయతీ వీరాపురం గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లాల్‌సింగ్ అనే యువకుడికి తీవ్రంగా గాయాలయ్యాయి. వివరాలు... మిర్యాలపెంట గ్రామం నుంచి ఇల్లెందుకు బైక్‌పై బయలుదేరిన లాల్‌సింగ్‌ను కొత్తగూడెం వెళ్తున్న ఆటో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. లాల్‌సింగ్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

జూలూరుపాడు: మున్నూరు కాపులను విస్మరిస్తే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాపట్ల మురళీ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మున్నూరు కాపు కార్పొరేషన్ సాధనకై సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 19న అన్ని జిల్లాల కేంద్రాల్లో ప్రజావాణిలో కలెక్టర్లకు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆర్డీఓలకు, నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలకు, మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మున్నూరు కాపులు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది మున్నూరు కాపులు ఉన్నట్లు చెప్పారు. 24 శాతం ఓటింగ్‌తో ఒక రాజకీయ పార్టీని ఓడించే, గెలిపించే శక్తి ఉందన్నారు. ప్రధానమైన డిమాండ్ మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడమేనన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న రాజ్‌కుమార్

పాల్వంచరూరల్: స్థానిక వికలాంగుల కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సోషల్ సర్వీస్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కేటీపీఎస్ ఎస్‌ఈ గుర్రం రాజ్‌కుమార్ పలకలు, నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ప్రాథమిక దశ నుంచే బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు.

జీపుజాతాను జయప్రదం చేయాలి

ఇల్లెందు: ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇళ్ల సాధన కోసం ఈ నెల 19న కొత్తగూడెం విచ్చేస్తున్న జీపు జాతాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడితే తప్ప పాలకులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని, పేదలు ఇళ్లు, ఇంటి స్థలాలు లేక అద్దె ఇళ్లల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, కృష్ణ, మోహన్‌రావు, వెంకన్న, శ్రీను, సంతోష్, రవి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపా’ కేసులు ఉపసంహరించుకోండి



జూలూరుపాడులో దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎన్డీ నాయకులు

ప్రశ్నించే మేధావులైన ప్రజాసంఘాల నాయకలు, ప్రొఫెసర్ హరగోపాల్, ఖాసీం, మహిళా నాయకురాళ్లు సంధ్య, విమలతోపాటు 152మందిపై పెట్టి ఉపా కేసులను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో శనివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్యకర్తలు



ఇల్లెందురూరల్: నినాదాలు చేస్తున్న నాయకులు

గిరిజన బాంధవుడు సీఎం కేసీఆర్



పాల్వంచరూరల్: గ్రామసభలో మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: సీఎం కేసీఆర్ గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న గిరిజన బాంధవుడని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజనోత్సవం సందర్భంగా దంతలబోరు గ్రామ పంచాయతీ గంగాదేవిగుప్ప గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. సభ ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమం కోసం విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. గిరివికాసం పథకంతో రైతుల భూముల్లో బోర్‌వెల్స్, ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనులను ప్రజాప్రతినిధులుగా చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే వనమా కృషి ఫలితంగా 1,369 మంది గిరిజనులకు 5,484 ఎకరాలకు పోడుపట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.అప్పారావు, ఎంపీఓ నారాయణ, సీడీపీఓ కనకదుర్గ, ఏపీఎం.రాంబాబు, సర్పంచ్ తెల్లం అలివేలు, కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి వారి సంక్షేమానికి కృషి చేస్తోందని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీతంపేట బంజర గ్రామంలో శనివారం జరిగిన గిరిజనోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి గ్రామ పరిధిలోని బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి, ఎంపీడీఓ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో శనివారం గిరిజనోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామసభలు నిర్వహించి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సాధించిన విజయాలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీసీ బాదావత్ శాంతి, ఎన్‌జే నగర్ సర్పంచ్ బాదావత్ సుగుణ, ఎంపీడీఓ మంద మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ స్థానికులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: స్వరాష్ట్రంలోనే గిరిజనులకు అత్యధికంగా లబ్ధి చేకూరిందని సర్పంచ్‌లు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం మండల కేంద్రంలో గిరిజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో సర్పంచ్‌లు మాట్లాడారు.

కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ అప్పారావు, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న సుదిమళ్ల సర్పంచ్ కల్తి పద్మ



చుంచుపల్లి: ధన్‌బాద్ గ్రామసభలో ప్రగతి వివరాలు వెల్లడిస్తున్న ఎంపీఓ సత్యనారాయణ



సుజాతనగర్: పల్లె ప్రకృతి వనం సందర్శనకు వస్తున్న జెడ్పీ సీఈఓ తదితరులు

ఇది పిచ్చుకల సామ్రాజ్యం..!



వేగంగా అంతరించిపోతున్న పక్షి జాతుల్లో పిచ్చుకలు ఒకటి. వీటి గూళ్లు ఒకటి రెండు చూస్తేనే అబ్బురపరుస్తాయి. అలాంటిది వందల సంఖ్యలో ఒకేచోట ఉంటే... నోట మాట రాదు కదా.. పైఫోటో చూడండి. పట్టణంలోని పాత పాల్వంచ చింతల చెరువు కట్ట కింద ప్రాచీన ప్రముఖ శ్రీ ఆత్మలింగేశ్వరాలయం ఎదుట ఓ విద్యుత్ టవర్‌కు ఫెన్సింగ్‌ను ఆసరా చేసుకుని గూళ్లు కట్టుకుని ఆవాసాలను ఏర్పాటు చేసుకున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం పక్షులు గుంపులుగా తమ గూళ్ల చేరుకుని కిచకిచ శబ్దాలతో కేరింతలు కొడుతుంటాయి. మాది లోకల్.. ఇదే మా సామ్రాజ్యం అన్నట్టు భ్రమింపజేస్తాయి. చెరువు కట్టపై వాకింగ్ చేసే వారికి, ఆత్మలింగేశ్వరాలయానికి వచ్చే భక్తులకు ఇదో పర్యాటక ప్రాంతం అయిపోయింది. పిచ్చుకల ఆటలను, గూళ్లను చూసి మురిసిపోతారు. సెల్‌ఫోన్లకు పనిచెప్పి సెల్ఫీలతో ప్రకృతిని ఆస్వాదిస్తుంటారు. శనివారం ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – పాల్వంచ